ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు 5
శనివారం 21 సెప్టెంబరు 2024



77 చెరువులకు కృష్ణా జలాలు ఎత్తిపోసే హంద్రీనీవా ప్రధాన కాలువ




ఈ ప్రభుత్వం కూడా ఇంతేనా..!

ప్రభుత్వం మారితే తలరాతలు మారుతాయనుకున్న రైతులకు అడియాశలే మిగిలాయి. హంద్రీనీవా కాలువ నుంచి 77 చెరువులకు కృష్ణా జలాలు ఎత్తిపోయడంపై ఆనాటి వైసీపీ ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యమే నేటి టీడీపీ కూటమి ప్రభుత్వం కూడా ప్రదర్శిస్తున్నది. వైఎస్ జగన్ చేసిన తప్పిదాలను చంద్రబాబు సవరిస్తారని అనుకున్న జనం ఈ ప్రభుత్వం కూడా ఇంతేనా? అని ఆవేదన చెందుతున్నారు. నిత్యం కరువుతో తల్లడిల్లే డోన్, పత్తికొండ, ఆలూరు, పాణ్యం నియోజకవర్గాల్లో కరువు రైతులకు 'కన్నీటి' కష్టాలు తప్పడం లేదు. కళ్ల ముందే కృష్ణా జలాలు జిల్లా సరిహద్దులు తరలిపోతున్నాయి. ఆ నీటిని ఎత్తిపోసేందుకు రూ.221 కోట్లకు పైగా ప్రజాధనం వెచ్చించి నిర్మించిన ఎత్తిపోతల పథకం సిద్ధంగా ఉంది. లేనిదల్లా పాలకుల్లో చిత్తశుద్ధి. 52 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బందిని నియమిస్తే.. కృష్ణా జలాలు ఎత్తిపోసి 68 చెరువులు నింపుతామని ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపితే గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కొత్తగా వచ్చిన టీడీపీ ప్రభుత్వం మేమేం తక్కువ అన్నట్లు వ్యవహరిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ప్రతిపాదలనకు పలు కొర్రీలు పెట్టి వెనక్కి నెట్టేసింది. నిర్వహణ సిబ్బంది నియమించకపోవడంతో 19 చెరువులను మాత్రమే నింపుతున్నారు. వాటిలో 13 చెరువులు డోన్ నియోజకవర్గంలో ఉన్నాయి.

ఎమ్మెల్యేలు చొరవ చూపకపోతే కన్నీళ్లే!

హంద్రీ నీవా కాలువలో నీళ్లున్నా చెరువులు నింపుకోలేని దైన్యం. నాడు వైసీపీ ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యమే.. నేడు కూటమి ప్రభుత్వం చూపుతోంది. నిధులు ఇవ్వకపోతే నిర్వహణ సాధ్యమా..? చెరువులు నింపగలరా..? పాలకులకు ఆ మాత్రం చిత్తశుద్ధి లేదా..? అని కరువు రైతులు ప్రశ్నిస్తున్నారు. డోన్, పత్తికొండ ఎమ్మెల్యేలు కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, కేఈ శ్యాంబాబు ప్రత్యేక చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు. సీఎం చంద్రబాబు, జలవనరులు శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుపై ఒత్తిడి తెచ్చి నిర్వహణ సిబ్బంది నియామకం, నిధులు మంజూరు చేయించాలి. లేదంటే ఆ ప్రాజెక్టు కూడా మరో గురురాఘవేంద్ర ప్రాజెక్టులా మారే ప్రమాదం ఉంది.



కర్నూలు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతమైన పత్తికొండ, ఆలూరు, డోన్ నియోజకవర్గాల్లో ఏటేటా కరువు దరువేస్తున్నది. కరువు.. వలసలు కవలల్లా వెంటాడుతున్నాయి. ఈ నియోజకవర్గాల గుండా హంద్రీ నీవా సుజల స్రవంతి ఎత్తిపోతల ప్రాజెక్టు ప్రధాన కాలువ ప్రవహిస్తున్నది. కృష్ణా జలాలు జిల్లా సరిహద్దులు దాటిపోతున్నా.. జిల్లాలోని మెట్ట పొలాలకు మళ్లించలేని పరిస్థితి ఉంది. రాయలకాలంలో తవ్విన చెరువులు వర్షాభావం వల్ల ఒట్టిపోతున్నాయి. సాగునీరు దేవుడెరుగు.. మూగ జీవాలకు తాగునీరు అందని దైన్యపరిస్థితి ఉంది. హంద్రీ-నీవా కాలువ కుడి, ఎడమ వైపుల ఉన్న ఆయా గ్రామాల 105 చెరువులకు కృష్ణా జలాలు ఎత్తిపోసి పల్లెసీమ రైతుల కన్నీళ్లు తుడవాలనే సంకల్పంతో రాష్ట్ర విభజన తరువాత ఆనాటి టీడీపీ ప్రభుత్వం డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి సీఎం చంద్రబాబు ఒత్తితెచ్చి రూ.224.31 కోట్లు మంజూరు చేయించారు. ఫేజ్-1 కింద 1238 టీఎంసీలు ఎత్తిపోసి 68 చెరువులు నింపే పనులకు 2018 మార్చి 20న జీవో నంబరు 169 జారీ చేశారు. కోయా కంపెనీ ఈ పనులను దక్కించుకుంది. గత టీడీపీ ప్రభుత్వంలోనే 35 శాతం వరకు పనులు పూర్తయ్యాయి. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం మొదట్లో నిర్లక్ష్యం చేసినా.. గత ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో ఎట్టకేలకు 90-95 శాతం పనులు పూర్తి చేశారు. ఎన్నికల ముందు హడావుడిగా నాటి సీఎం జగన్ చేత ప్రారంభించారు. 68 చెరువుల నుంచి 77 చెరువులకు పెంచారు. రివైజ్డ్ ఎస్టిమేషన్ (ఆర్ఈ) రూ.267.23 కోట్లకు అంచనాలు పెంచారు. అయితే.. ఈ ప్రాజెక్టు నిర్వహణ కోసం అవసరమైన ఓట్ సోర్సింగ్ సిబ్బంది నియమకాన్ని మాత్రం నాటి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇప్పుడే అదే శాపంగా మారింది.



హంద్రీనీవా కాలువ ఒడ్డున నిర్మించిన నిర్మించిన ప్రధాన పంప్‌హౌస్

నీరు ఎత్తిపోస్తున్న చెరువులు ఇవే..

- డోన్ నియోజకవర్గం : డోన్ మండలం ఎల్లారెడ్డి చెరువు, మల్లెంపల్లె చెరువు, వెంకటాపురం ఎంఐ చెరువు, ఉడుములపాడు చెరువు, యాపదిన్నె చెరువు, ఓబులాపురం నడిమి కంటు, జమ్మికుంట, కల్పన కుంట, చనుగొండ్ల చెరువు, నల్లచెరువు, ప్యాపిలి మండలం సర్దార్‌కుంట, ఎనుగుమర్రి ఎంఐ చెరువు.
- పత్తికొండ నియోజకవర్గం: కృష్ణగిరి మండలం గుంటి రంగనాథస్వామి చెక్‌డ్యాం, కటారుకొండ చెరువు, అలంకొండ చెరువు, తుగ్గలి మండలం బొందిమడుగుల చెరువు, ముక్కెల్ల చెరువు, రాంపల్లి చెరువు, అయ్యవారికుంట.

- 77 చెరువులకు కృష్ణా జలాలు ఎత్తిపోతల ఏమైంది?
- చివరికి 19 చెరువులకే కుదింపు
- ఇప్పటికే రూ.221 కోట్లకు పైగా ప్రజాధనం ఖర్చు
- నిర్వహణ సిబ్బంది లేక నెరవేరని లక్ష్యం
- 52 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని ఇవ్వాలని ప్రతిపాదన
- టీడీపీ కూటమి ప్రభుత్వంలోనూ అదే నిర్లక్ష్యం
- డోన్, పత్తికొండ ఎమ్మెల్యేలు దృష్టి సారించచపోతే కరువు రైతులకు కన్నీళ్లే

కొర్రీలు పెట్టి వెనక్కి పంపేశారు

ఒప్పందం మేరకు కాంట్రాక్ట్ సంస్థ హంద్రీనీవా కాలువ నుంచి 77 చెరువులకు నీటిని పోత్తిపోసే ప్రధాన పంప్‌హౌస్, డెలివరీ ఛాంబర్, 200 కిలోమీటర్ల పైప్‌లైన్, 159 క్యూసెక్కులు ఎత్తిపోతల సామర్థ్యంతో మూడు 3800 హెచ్‌పీ విద్యుత్ పంపులు (ఒక్కొక్కటి 53 క్యూసెక్కులు) ఏర్పాటు మాత్రమే చేయాలి. చెరువులకు నీరు మళ్లించే బాధ్యత ఇరిగేషన్ అధికారులదే. పంప్‌హౌస్, డెలివరీ ఛాంబర్, పైపులైన్ నిర్వహణ కోసం రెండు సిఫ్టులలో పని చేయడానికి 84 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది నియమించాలని, ఇందుకు నెలకు రూ.15 లక్షలు చొప్పున ఏడాది రూ.1.80 కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరుతూ పనులు పర్యవేక్షిస్తున్న జలవనరుల శాక ఎఫ్ఆర్ఎల్ డివిజన్ ఇంజనీర్లు ప్రాజెక్ట్ సీఈ కబీర్‌బాషా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. పంప్‌హౌస్, డెలివరీ ఛాంబర్ నిర్వహణకు మూడు షిఫ్టులకు 18 మంది, గ్రావిటీ మెయిన్ పైప్‌లైన్, డెలివరీ సిస్టమ్, డిస్టిబ్యూటరీ సిస్టమ్ నిర్వహణకు ఒక్క షిఫ్టుకు లస్కర్లు 27, సూపర్‌వైజర్లు ఐదుగురు చొప్పున రెండు షిఫ్టులకు 64 మంది కలిపి మొత్తం 82 మంది సిబ్బంది అవసరమైన, ఔట్ సోర్సింగ్ జీవో మేరకు ఒక్కొక్కరికి రూ.15-18 వేలు ప్రకారం నెలనెలా వేతనం చెల్లించాలని ప్రతిపాదించారు. ఆ ఫైలును జలవనరుల శాఖ రాష్ట్ర అధికారులు కొర్రీలు పెట్టి వెనక్కి నెట్టేశారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

హంద్రీనీవా కాలువ నుంచి 77 చెరువులకు కృష్ణా జలాలు ఎత్తిపోయాలంటే 200 కిలోమీటర్ల పైపులైన్ ఉంది. 8 కిలోమీటర్లకు రెండు షిఫ్టుల్లో ఇద్దరు ఔట్ సోర్సింగ్ సిబ్బంది అవసరం ఉంది. పంప్‌హౌస్, డెలివరీ ఛాంబర్, సిస్టమ్, డిస్ట్రిబ్యూటరీలను నిర్వహించాలి. దాదాపు 82 మంది సిబ్బంది అవసరం ఉంటుంది. నెలకు రూ.15 లక్షలు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రస్తుతం 19 చెరువులను మాత్రమే నింపుతున్నాం.

- రామకృష్ణ, డీఈఈ, ఎఫ్ఆర్ఎల్ సబ్ డివిజన్, కర్నూలు

సంక్షోభంలోనూ సంక్షేమం

- చంద్రబాబుది ఆదర్శవంతమైన పాలన
- రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



గుళ్లదుర్తిలో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

కోవెలకుంట్ల, సెప్టెంబరు 20: ప్రస్తుతం ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కోవెలకుంట్ల మండల పరిధి లోని గుళ్లదుర్తి గ్రామంలో కూటమి ప్రభుత్వం వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా 'ఇది మంచి ప్రభుత్వం' ప్రజా వేదిక సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి బీసీతో పాటు కలెక్టర్ రాజకుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా బీసీ మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశానన్నారు. ప్రస్తుతం తాను మంత్రి కావడంతో రాష్ట్రంలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేయడం వల్ల నియోజకవర్గ ప్రజలకు కొంత మేర దూరమవుతున్నాని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు అయినప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. జిల్లాలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని వాటి మరమ్మతులకు రూ.530 కోట్లు ఖర్చవుతుందని అందుకోసం మంత్రి నిధుల మంజూరుకు కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటికే రూ.2.6 కోట్లు నిధులు మంజూరైనట్లు తెలిపారు. అనంతరం గుళ్లదుర్తి గ్రామంలో నెలకొన్న సమస్యలపై ప్రజల నుంచి మంత్రి, కలెక్టర్లు పిర్యాదులు స్వీకరించారు.

చంద్రబాబుది ప్రజా పాలన

రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్



ప్రజలకు కూటమి కరపత్రాలను అందజేస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్, సెప్టెంబరు 20: చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ప్రజాపాలన సాగిస్తోందని రాష్ట్ర మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. కూటమి పాలన వందరోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని శుక్రవారం నంద్యాల పట్టణంలోని నూనెపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం చేసిన కార్యక్రమాలను వివరించి కరపత్రాను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నారన్నారు. మెగా డీఎస్సీని ప్రకటించడం, నిరుద్యోగులకు అండగా ఉంటూ ప్రస్తుతం 16,437మందికి ఉపాధి కల్పించిందన్నారు. పంచాయతీలకు రూ.1452 కోట్లు మంజూరు చేసి వాటికి ప్రాణం పోసిందని తెలిపారు. నంద్యాల నియోజకవర్గంలో పరిశ్రమలు నెలకొల్పడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అన్ని గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వాము ధర పైపైకి



కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 20: వాము ధర భారీగా పెరుగుతోంది. శుక్రవారం కర్నూలు మార్కెట్ యార్డులో వాము ధర గరిష్ఠంగా రూ.18,111లు పలికింది. మధ్యస్థ ధర రూ.15,688, కనిష్ఠ ధర రూ.4,811 ధర రైతులకు అందినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. అదేవిధంగా ఉల్లిగడ్డలకు గరిష్ఠంగా రూ.3,983, మధ్యస్థం రూ.2,818, కనిష్ఠంగా రూ.537 ధర రైతులకు అందింది. కొర్రలు గరిష్ఠ ధర రూ.3,009, మధ్యస్థ ధర రూ.2,596, కనిష్ఠ ధర రూ.1,939 ధర పలికింది. మినుములకు క్వింటం గరిష్ఠం మధ్యస్థం, కనిష్ఠం ధర రూ.3,111 రైతులకు దక్కింది. సజ్జలకు రూ.2,096, మధ్యస్థ ధర రూ.2,041, కనిష్ఠ ధర రూ.1,931 ధర అందింది. వేరుశనగ కాయలు భారీగా కర్నూలు యార్డుకు అమ్మకానికి వస్తున్నాయి. గరిష్ఠ ధర రూ.7,012, మధ్యస్థ ధర రూ.4,700, కనిష్ఠ ధర రూ.1,509 దక్కింది. ఆముదాలకు గరిష్ఠ ధర రూ.5,921, మధ్యస్థ రూ.5,901, కనిష్ఠ ధర రూ.5,427 దక్కింది.

జగన్‌కు వాస్తవాలు రుచించవు

ఎంపీ బైరెడ్డి శబరి



నంద్యాల రూరల్, సెప్టెంబరు 20 : కట్టు కథలు చెప్పే మాజీ సీఎం జగన్‌రెడ్డికి వాస్తవాలు రుచించవని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి శుక్రవారం అన్నారు. తిరుపతి లడ్డూ విషయంలో ల్యాబ్‌లో సాక్ష్యాధారాలతో సహా నెయ్యిలో జంతువుల కొవ్వు వాడారన్న విషయం బట్టబయలైనా జగన్ తీరులో మార్పు రాలేదని అన్నారు. కొవ్వు కట్టుకథ అని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఆమె ఎద్దేవా చేశారు. ల్యాబ్ నివేదికలు, జంతువుల అవశేషాలు, చేప నూనె, పందికొవ్వు ఉండటం కట్టుకథలని చెప్పడం జగన్‌రెడ్డికే చెల్లిందని ఆమె మండిపడ్డారు. హిందువులు గోమాతను దేవతగా కొలుస్తారని, అలాంటి గోవు మాంసం నూనె లడ్డూ తయారీలో వాడటం దుర్మార్గమని, అత్యంత పాపమని ఆమె అన్నారు. తిరుమల లడ్డూలో వాడే నెయ్యి కల్తీ చేయడంకంటే మరోపాపం ఉండదని, ఈ పాపం జగన్మోహన్‌రెడ్డి, వైసీపీ ప్రభుత్వానిదేనని ధ్వజమెత్తారు. హిందువులు కాని వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకరరెడ్డిలను టీటీడీ ఛైర్మన్లుగా జగన్ నియమించడమే ప్రధాన పొరపాటని విమర్శించారు.

రాష్ట్ర స్థాయి టాపర్‌గా మహేష్

ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం ఫలితాల్లో నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థి సత్తా



వైద్య విద్యార్థి మహేష్

నంద్యాల రూరల్, సెప్టెంబరు 20 : డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ విడుదల చేసిన మొదటి సంవత్సర ఎంబీబీఎస్ పరీక్షా ఫలితాల్లో నంద్యాలలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థి డీవీఎన్ఎస్ మహేష్ రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించాడు. 900 మార్కులకుగాను 741 మార్కులు మహేష్ సాధించి యూనివర్సిటీ టాపర్‌గా నిలిచాడు. అదేవిధంగా 82.3 శాతం నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ముగ్గురు డిస్టింక్షన్‌లో, 45 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆనందరావు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

తగ్గిన పత్తి ధర

ఆదోని మార్కెట్‌లో క్వింటా రూ.8,139



ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 20 : వారం రోజులుగా పత్తిధరలు రైతులను ఊరించాయి. అంతలోనే పత్తిధరలు పడిపోయాయి. ధరలు పతనం కావడంతో రైతులు నిరాశకు గురవుతున్నారు. శుక్రవారం పత్తిధర క్వింటం గరిష్ఠంగా రూ.8139 పలికింది. ఒక్కరోజులోనే క్వింటానికి రూ.150 పైగా ధర తగ్గడం పై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్ దిగుబడులు చేతికి రావడంతో మొదటి కోత దిగుబడిని విక్రయానికి భారీగా తీసుకొచ్చారు. 11627 క్వింటాలు రావడంతో వ్యాపారులు ధరలు తగ్గించారని రైతులు వాపోతున్నారు. ఇలా ధరలు తగ్గితే పెట్టుబడి ఖర్చులు కూడా రాక అప్పులపాలు అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తిధర క్వింటాలు కనిష్ఠ ధర రూ.4489, గరిష్ఠ ధర రూ.8139, మధ్యస్థ ధర రూ.7769 పలికింది.

శ్రీశైలం జలాశయానికి నిలిచిన ఇన్‌ఫ్లో



శ్రీశైలం, సెప్టెంబరు 20: శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శుక్రవారం వరద ప్రవాహం పూర్తిగా నిలిచిపోయింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 878.40 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 179.8995 టీఎంసీలుగా ఉంది. తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37116 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని నిలుపుదల చేశారు.

మరో ఐదుగురికి తీవ్ర అస్వస్థత

- ఒకరికి కర్నూలులో, మరో ఆరుగురికి ఆదోనిలో చికిత్స
- రేకుల షెడ్డు వేడి, ఉడకని అన్నం వల్లే అంటున్న విద్యార్థినిలు



చికిత్స పొందుతున్నవిద్యార్థినులు

ఆదోని/ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 20 : ఆదోని మండిగిరి పంచాయతీ పరిధిలోని ఆర్టీనగర్‌లో ఉన్న ప్రభుత్వ బాలికల కళాశాల హాస్టల్ విద్యార్థినిల్లో మరో ఐదుగురు శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఉదయం కళాశాలకు వెళ్లిన విద్యార్థినిలు ఉదయం ముగ్గురు స్పృహ తప్పి పోగా, మధ్యాహ్నం మరో ఇద్దరు తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో కళాశాల ప్రిన్సిపాల్ సంజయన్న, అధ్యాపకులు హుటాహుటిన ఆంబులెన్స్‌లో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. గురువారం ఇందు భాగ్యమ్మ అస్వస్థతకు గురయ్యారు. ఇందు అనే విద్యార్థినికి బీపీ కంట్రోల్ కాక పరిస్థితి విషమించడంతో వైద్యులు కర్నూలుకు మెరుగైన చికిత్స కోసం తరలించారు. సింధు, శిరీష, మహాలక్ష్మి, రాజేశ్వరి, లేఖన అనే విద్యార్థినిలు ఆదోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరంతా రేకుల షెడ్డు వల్ల అధిక వేడికి గురైనట్లు డా. శ్రీరాములు నాయక్ తెలిపారు. వారి పరిస్థితి ప్రస్తుతం బాగుందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. చికిత్స పొందుతున్న విద్యార్థినిలను తహసీల్దార్ శివరాముడు పరామర్శించి వైద్యులను, వారి ఆరోగ్య పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. వైద్యులను హాస్టల్‌కు వెళ్లి విద్యార్థినిలకు వైద్య పరీక్షలు చేయాలని సూచించడంతో డా. శ్రీరాం నాయక్, డా. జగదీష్‌తో పాటు మరో ముగ్గురు వైద్యులు హాస్టల్ చేరుకొని వారితో మాట్లాడారు. హాస్టల్ విద్యార్థినిలు ఉడకని అన్నం, నీళ్ల సాంబార్, ఆకుకూర పప్పు మెనూ కూడా పాటించకుండా వడ్డిస్తున్నారని వాపోయారు. ప్రతిరోజూ మధ్యాహ్నం పచ్చి మిరప పప్పును క్యారియర్‌లో పంపుతున్నారని, అది తినేలోపు చెడిపోతుందని కన్నీరు పెట్టుకుంటున్నారు. సాయంత్రం వేళ కనీసం స్నాక్స్ కూడా ఇవ్వడం లేదన్నారు. హాస్టల్ వార్డెన్ పరిమళమ్మను అడిగితే.. తమను బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేకుల షెడ్డు కింద ఉక్కపోతతో అల్లాడుతున్నామని ఫ్యాన్‌లు కూడా లేవన్నారు.




హాస్టల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మతిమరుపుతో సతమతం

● అప్రమత్తతే ఔషధం ● 65 ఏళ్లు పైబడిన వారిలో అల్జీమర్స్

నేడు వరల్డ్ అల్జీమర్స్ డే

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 20: అల్జీమర్స్ సాధారణ మతిమరుపు కాదు. రోజువారి జీవితంలో మామూలు మతిమరుపుగా ఆరంభమై క్రమంగా అదొక తీవ్ర సమస్యగా మారుతుంది. సాధారణంగా 65 ఏళ్లుపైబడిన వారిలో ఈ వ్యాధి వస్తుంది. దీని గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం సెప్టెంబరు 21న ప్రపంచ అల్జీమర్స్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అల్జీమర్స్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 1994 నుంచి నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ప్రత్యేకించి పోస్టు డయాగ్నోస్టిక్ మద్దతుపై దృష్టి పెట్టింది. అల్జీమర్స్ వ్యాధి 60-70 శాతం అంగవైకల్యం కేసులకు కారణమవుతుందని, రాబోయే కాలంలో ఈ సంఖ్య పెరుగుతుందని సూచించింది. న్యూరోడిజెనరేటివ్ వ్యాధులు మెల్లగా ప్రారంభమవుతాయని హెచ్చరించింది. అల్జీమర్స్ వ్యాధి వచ్చాక మూడు రకాలుగా జ్ఞాపకశక్తి కోల్పోతుంటారు. తక్షణ జ్ఞాపక శక్తి, రీసెంట్ జ్ఞాపక శక్తి, రిమోట్ మెమోరీ అనే సమస్యలు ఉంటాయి. ఈ మూడింటిని మరిచిపోయే వారిలో కొన్ని లక్షణాలు కనిపిస్తుంటాయి. అలా కనిపిస్తే అల్జీమర్స్‌తో బాధపడుతున్నట్లు గుర్తించాలి.



గుర్తించడం ఇలా


- ఎప్పుడూ చేసే పనులు కూడా సొంతంగా చేసుకోలేకపోవడం.
- దారులు మరిచిపోవడం
- కళ్లద్దాలు, పెన్నులు మరిచిపోవడం
- ఒకే విషయంపై ఆలోచన చేయలేకపోవడం
- మాట్లాడుతున్నప్పుడు పొంతన కోల్పోవడం
- తిన్నది కూడా గుర్తు లేకపోవడం

అల్జీమర్ డిమాన్షియా ప్రమాదకరం

డిమాన్షియా (మతిమరుపు)ను రెండు రకాలుగా చెప్పవచ్చు. మొదటి వాస్క్యులర్ డిమాన్షియా. ఇది మెదడుకు సరిగ్గా రక్త ప్రసరణ జరగనివారిలో కనిపిస్తుంది. బీపీ, డయాబెటిక్, స్మోకింగ్, అధిక కొలస్ట్రాల్, అల్కహాల్ అలవాటు ఉన్న వారిలో లక్షణాలు కనిపిస్తాయి. రెండో సూడో డిమాన్షియా. ఇది వయస్సుతో సంబంధం లేకుండా వస్తుంది. అధిక ఒత్తిడి, డిప్రెషన్, ఆల్కహాల్, మాదక ద్రవ్యాలు వాడే అలవాటు ఉన్న వారిలో ఎక్కువగా కనిపిస్తుంది. మెదడులోని కణాలు తగ్గడం వల్ల ఈ వ్యాధి వస్తుంది. దీని బారిన పడిన వారికి తీవ్రమైన మతిమరుపు ఉంటుంది.

కారణాలివి

వయస్సు పైబడటం వల్ల మెదడు సెల్స్ తగ్గడమే అల్జీమర్స్‌కు ప్రధాన కారణం. బ్రెయిన్ సెల్స్ తగ్గడానికి ఒత్తిడి, నిద్రలేమి, జీవనశైలి మార్పు, విటమిన్స్ (బీ1, బీ12, బీ6)లోపం, జెనెటికల్‌గా కూడా అల్జీమర్స్ వస్తుంది. గుండెజబ్బులున్న వారు ఆల్కహాల్, డ్రగ్స్, పొగతాగే అలవాట్లు ఉన్న వారు దీని బారిన పడే అవకాశాలున్నాయి.



అల్జీమర్స్‌ను ప్రారంభ దశలో గుర్తించాలి



అల్జీమర్స్ వ్యాధితో ప్రపంచ వ్యాప్తంగా 60 మిలియన్ల మంది బాధపడుతున్నారు. 65 సంవత్సరాల వయస్సు దాటిన ప్రతి 9 మందిలో ఒకరు వ్యాధికి గురయ్యే అవకాశం ఉంది. ఈ వ్యాధిని ప్రారంభదశలోగుర్తించి వైద్యులను సంప్రదించి వ్యాధి లక్షణాలు పెరగకుండా చూసుకోవాలి.

- డాక్టర్ చల్లపల్లి బాబురావు, కన్సల్టెంట్ న్యూరాలజిస్టు, కర్నూలు కిమ్స్ హాస్పిటల్

ప్రాథమిక దశలోనే గుర్తించాలి

అల్జీమర్స్ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స అందించాలి. మెదడులో హార్మోన్ల విడుదల జరిగి కూడా కణాలకు యాక్టివ్ చేసే మందులను వాడాలి. వ్యాధిగ్రస్తులకు కుటుంబం సమాజం నుంచి తగిన సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. వ్యాధిగ్రస్తులతో ఎవరో ఒకరు మాట్లాడుతూ ఉండాలి. మెదడుకు పని చెప్పేలా చెస్, క్యారమ్స్, ఫజిల్స్ మ్యాజిక్ వంటివి బ్రెయిన్‌ను యాక్టివ్‌గా ఉంచుతాయి.

అవగాహన అవసరం



చాలా మందికి అల్జీమర్ పట్ల అవగాహన ఉండదు. మెదడు కణాలు తగ్గడం వల్ల ఈ వ్యాధి వస్తుంది. 65 ఏళ్లు పైబడిన వారిలో ఇది అధికంగా వస్తుంది. న్యూరాలజీ ఓపీ ప్రతి సోమ, గురువారాల్లో ఉంటుంది. వారంలో అల్జీమర్ అనుమానిత కేసులు 30 నుంచి 35 దాకా వస్తుంటాయి.

- డాక్టర్ సి.శ్రీనివాసులు, హెచ్‌వోడీ, న్యూరాలజీ విభాగం, కర్నూలు జీజీహెచ్

పల్లెల్లోనే ఎక్కువ



అల్జీమర్స్ కేసులు పట్టణాల్లో కన్నా గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా ఉన్నాయి. అందుకు కారణం అల్జీమర్స్‌కు దారితీసే కారణాల్లో ఒకటైన స్మోకింగ్ పల్లెల్లో ఎక్కువ. అది కూడా చిన్న వయస్సు లోనే స్మోకింగ్‌కు అలవాటు ఉండటం వల్ల ఈ కేసులు నమోదవుతుంటాయి.

-డాక్టర్ ఎన్.సురేష్, న్యూరో ఫిజిషియన్, మెడికవర్ హాస్పిటల్, కర్నూలు

రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు తగవు

పోలీస్‌స్టేషన్‌లో డీసీసీ ఫిర్యాదు



బీజేపీ నాయకులపై ఫిర్యాదు చేస్తున్న డీసీసీ నాయకులు

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 20: లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై బీజేపీ నాయకులు చేసిన వ్యాఖ్యలపై నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జె. లక్ష్మీనరసింహ యదవ్ మండిపడ్డారు. శుక్రవారం నగరంలోని నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు షేక్ జీలానీ బాషాతో కలిసి సీఐకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహ యాదవ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీని హతమార్చాలంటూ బీజేపీ, శివసేన నాయకులు బహిరంగంగా విమర్శించడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ వ్యాఖ్యలపై సుప్రీం కోర్టు సుమోటోగా తీసుకుని బీజేపీ నాయకులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా డైరెక్షన్ లోనే ఇదంతా జరుగుతోందన్నారు. ఈ దుర్మార్గాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ అన్ని మతాలు, కులాలను సమానంగా చూస్తోందన్నారు. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్న బీజేపీకి దేశాన్ని పాలించే అర్హత లేదన్నారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) చట్టాల మేరకు అలస్యం లేకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేయించి తగిన చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నంద్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ జాకీర్, మనపాటి శ్రీనివాస్‌గౌడ్, కురువ రవి కుమార్, రజాక్ బాషా, అఫ్రోజ్, చెన్నయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన మురళీకృష్ణ



ఎస్పీని కలిసిన డీసీసీ

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 20: కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ పక్షనేత రాహుల్‌గాంధీపై బీజేపీ, శివసేన నాయకులు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ బిందుమాధవ్‌ను కర్నూలు డీసీసీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో బిందుమాధవ్‌ను కలిశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బజారన్న, తిప్పన్న నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తవ్వుతున్న వాహనాల సీజ్

మంత్రాలయం, సెప్టెంబరు 20: మంత్రాలయం మండలంలోని వగరూరు గ్రామానికి చెందిన ఉరుకుంద, సూగూరు గ్రామానికి చెందిన కురువ రవికుమార్, షేక్ రజాక్ మూడు ట్రాక్టర్లల్లో ఇసుక తవ్వుతుండగా సీజ్ చేసినట్లు మంత్రాలయం ఎస్ఐ పరమేశ్ నాయక్ తెలిపారు. గురువారం అర్ధరాత్రి కురువ రాముడుకు చెందిన ఎక్స్‌కవేటర్‌తో వంకలో దిగి ట్రాక్టరులో ఇసుక వేస్తుండగా.. దాడులు చేసి పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. గత రెండు రోజుల క్రితం ఉరుకుంద అక్రమంగా ఇసుక తరలిస్తుండగా.. కేసులు నమోదు చేసి గనులశాఖకు నివేదికలు పంపినట్లు తెలిపారు. వగరూరు చెందిన ఉరుకుంద ట్రాక్టరుకు రూ.20వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక సరఫరా చేస్తే కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు.

జనన ధ్రువీకరణ పత్రాల జారీలో అవకతవకలు

పరిశీలించాలని కమిషనర్లకు డీఎంహెచ్‌వో లేఖ

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 20: జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో చోటు చేసుకుంటున్న అవకతవకలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.ఎల్.భాస్కర్ సంబంధిత కమిషనర్లకు లేఖ రాశారు. నగర పాలక సంస్థతోపాటు ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు మున్సిపాలిటీల్లో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో అవకతవకలు చేసుకుంటున్నాయని ఆయన అందులో పేర్కొన్నారు. ప్రధానంగా నగర పాలక సంస్థ కార్యాలయంలో నిబంధనలు పాటించడం లేదని, నగర పాలక హెల్త్ ఆఫీసర్‌కు గట్టిగా ఆదేశాలు జారీ చేయాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ కమిషనర్‌ను కోరారు. నర్సింగ్ హోమ్‌లో, ప్రైవేట్ హాస్పిటళ్ల నుంచి వచ్చే నివేదికలను ఒకటికి రెండుసార్లు పరిశీలించాలని నగర పాలక ఎంహెచ్‌వోకు సూచించారు.

సంక్షేమ పథకాలను ప్రజల దగ్గరికి చేర్చండి: కలెక్టర్

కర్నూలు(రూరల్)సెప్టెంబరు20: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సక్రమంగా నూటికి నూరు శాతం ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కర్నూలు రూరల్ మండలం బి. తాండ్రపాడు గ్రామంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరితో కలిసి కలెక్టర్ ఇంటింటికి తిరిగి ఇది మంచి ప్రభుత్వం అనే స్టిక్కర్లను, కరపత్రాలను ప్రజలకు అందజేసి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి స్థానికులకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వందరోజుల పాలన పూర్తి అయిన సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిందన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అకాంక్షలకు అవసరాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు.

పెద్దహోతూరులో ఇరువర్గాల మధ్య ఘర్షణ

ఆలూరు, సెప్టెంబరు 20 : ఆలూరు మండలం పెద్దహోతూరు గ్రామంలో శుక్రవారం రాత్రి బీసీ, ఎస్సీ సామాజిక వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఐదుగురికి గాయాలు కావడంతో ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బోయ రాముడు అనే వ్యక్తి ఓ సామాజిక వర్గానికి చెందిన ఓ మహిళను అసభ్యంగా దూషించడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి. బోయ రాముడితో పాటు మరో నలుగురిపై అట్రాసిటీ కేసు నమోదు చేస్తున్నట్లు ఆలూరు ఎస్ఐ వెంకట నరసింహులు తెలిపారు. గ్రామంలో ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

మొబైల్ రికవరీ మేళా

బాధితులకు 587 మొబైల్ ఫోన్లు



సెల్‌ఫోన్లను పరిశీలిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు, సెప్టెంబరు 20: జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో మొబైల్ రికవరీ మేళా కార్యక్రమాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఎస్పీ జి.బిందు మాధవ్ ఆధ్వర్యంలో మొబైల్ ఫోన్లను సంబంధిత బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇటీవల కాలంలో మొబైల్ తమ జీవితంలో ఒక భాగమైందన్నారు. అటాచ్‌మెంట్స్, బ్యాంకు ఏటీఎం, బ్యాంకు ఖాతాలు, సెటిల్మెంట్లు, పర్సనల్ సమాచారం ఇలా ఎన్నో సేవలు మొబైల్ ద్వారా వినియోగిస్తున్నారమని తెలిపారు. మొబైల్స్ పోగొట్టుకుంటే ఎలాంటి రుసుము లేకుండా ఉచితంగా Http:// kurnoolpolice.in/mobiletheft వెబ్‌సైట్‌కు వెళ్లి పోగొట్టుకున్న సెల్‌ఫోన్ వివరాలు అందజేస్తే రికవరీ చేసేందుకు కర్నూలు సైబర్ ల్యాబ్ పోలీసులు కృషి చేస్తారన్నారు. శుక్రవారం మొబైల్ మేళా నిర్వహించి మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు సెల్‌ఫోన్లు అందించామని చెప్పారు. ఫోన్లు పోగొట్టుకున్న వారు జిల్లా పోలీస్ శాఖ తెలిపిన వెబ్‌సైట్‌కు లింక్‌ను క్లిక్ చేసి మొబైల్ లాస్ట్ కాలంలో మీపేరు, మీ జిల్లా, మీ పోలీస్‌స్టేషన్ పరిధి, మీ మొబైల్‌కు సంబంధించిన వివరాలు, ప్రస్తుతం ఉపయోగిస్తున్న మొబైల్ నెంబరు కాంటాక్ట్ వివరాలు సబ్‌మిట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు, సైబర్ ల్యాబ్ టెక్నికల్ టీమ్ శ్రీనివాసులు, అబ్దుల్‌గౌస్, కేశవరెడ్డి, సైబర్ ల్యాబ్ టెక్నికల్ టీమ్ సభ్యులు ఉన్నారు.

మంత్రాలయంలో సినీ నటుడు పూరీ ఆకాశ్



మంచాలమ్మకు పూజలు చేస్తున్న సినీ నటుడు పూరీ ఆకాశ్

మంత్రాలయం, సెప్టెంబరు 20: రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ప్రముఖ సినీ దర్శకులు పూరీ జగన్నాథ్ కుమారుడు సినీ నటుడు పూరీ ఆకాశ్ గురువారం రాత్రి మంత్రాలయం వచ్చారు. ఈయనకు మఠం ఏఏఓ మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేశ్ జోషి, శ్రీపతి ఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

నిరుద్యోగులకు కుచ్చుటోపి

ఉద్యోగాల పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ.1.50 లక్షల వసూలు

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 20: ఓ స్వచ్ఛంద సేవా సంస్థ నిరుద్యోగులకు కుచ్చుటోపి పెట్టింది. ఉద్యోగాల ఆశ చూపి రూ.15 వేల జీతం ఇప్పిస్తామని చెప్పి ఒక్కొక్కరి నుంచి రూ.1.5 లక్షలు వసూలు చేసింది. ఆగస్టు 7న బుద్ధ యోగా ఫౌండేషన్ అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చి పాఠశాలలో పని చేయండని స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు ఆదేశించారు. ఉత్తర్వులు తీసుకుని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల వద్దకు వెళితే.. తమకు జిల్లా విద్యాశాఖ అధికారుల నుంచి ఎలాంటి సమాచారం లేదని వారు చెప్పడంతో ఉత్తర్వులు అందుకున్న నిరుద్యోగులు తెల్లముఖం వేశారు. మోసపోయిన వారు పాఠశాలల చుట్టూ, విద్యాశాఖ అధికారుల చుట్టు తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మోసపోయిన తమకు స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు నుంచి తిరిగి డబ్బులు ఇప్పించాలని గూడూరు మండలంలోని వడ్ల అరవింద్, దస్తగిరి, శ్రీరాములు అధికారులను కోరారు.

కొత్త విద్యుత్ సర్కిళ్ల ఏర్పాటుకు ప్రభుత్వ ఆదేశం

కొత్త ఆపరేషన్ సర్కిల్ కానున్న నంద్యాల జిల్లా

కల్లూరు, సెప్టెంబరు 20: రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన జిల్లాలను విద్యుత్ శాఖ ఆపరేషన్ సర్కిళ్లుగా ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఏపీఎస్పీడీసీఎల్, ఏపీఈపీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్ (డిస్కం) సీఎండీలను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల పునర్విభజన నేపథ్యంలో ఆయా డిస్కం పరిధిలో కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో ఆపరేషన్ సర్కిళ్లను ఏర్పాటు చేసేలా ఆదేశించారు. ఈ క్రమంలో నూతన సర్కిళ్ల ఏర్పాటులో డిస్కంలపై అదనపు భారం పడకుండా ప్రస్తుతం ఉన్న మానవ వనరులను సక్రమంగా కేటాయించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పరిపాలన సౌలభ్యం కోసం ఖర్చులు లేకుండా వినియోగదారులకు మెరుగైన సేవలు అందజేసేలా కార్యాచరణ తయారు చేసేకోవాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అందుకు అనుగుణంగా నూతనంగా ఏర్పడిన జిల్లా కేంద్రాల్లో తగు చర్యలు చేపట్టాలని డిస్కం సీఎండీలను ప్రభుత్వం ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

కొత్త సర్కిల్లోని డివిజన్లు ఇవే...

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నంద్యాల కొత్త విద్యుత్‌శాఖ సర్కిల్‌గా ఏర్పడనుంది. ఈమేరకు నంద్యాల, డోన్, ఆత్మకూరు డివిజన్లు నంద్యాల జిల్లా విద్యుత్‌శాఖ సర్కిల్‌లో కలవనున్నాయి.

సఫాయి కర్మచారుల జాబితాను రూపొందించండి

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 20: సర్వే నిర్వహించి సఫాయి కర్మచారుల జాబితాను రూపొందించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆర్డీవోలు, మున్సిపాల్ కమిషనర్‌లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ప్రొహిబిషన్ ఆఫ్ మ్యాన్యువల్ స్కావెంజర్స్ రిహాబిలిటేషన్ యాక్టు-2013 అమలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలు, ఆసుపత్రులు, రైల్వేలు, శానిటేషన్ ఎక్కువగా జరిగే ప్రదేశాలలో సఫాయి కర్మచారులు ఉంటారని, సర్వే చేసి జాబితా తయారు చేయాలని ఆదేశించారు.

ఒకే చోట రెండు ప్రమాదాలు

ఏడుగురికి గాయాలు

నందికొట్కూరు, సెప్టెంబరు 20: పది పదిహేను నిమిషాల వ్యవధిలో ఒకే చోట రెండు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనల్లో ఏడుగురికి గాయాలయ్యాయి. నందికొట్కూరు నుంచి నాగలూటికి వెళ్లే ద్విచక్ర వాహనదారుడిని కర్నూలు నుంచి ఆత్మకూరు వైపు వెళ్తున్న కారు నాగలూటి క్రాస్ వద్ద ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనదారుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. పగిడ్యాల మండలం నెహ్రూనగర్‌కు చెందిన వెంకటేశ్వరరాజు నాగలూటి సచివాలయంలో విద్యుత్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం విధులకు వెళ్తుండగా జాతీయ రహదారి 340-సీని క్రాస్ చేస్తుండగా కర్నూలు నుంచి వస్తున్న కారు ఢీకొంది. గాయాలు కావడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇదే ప్రదేశంలోనే పది నిమిషాల వ్యవధిలో వ్యవసాయ పనులకు వెళ్తున్న ఆటోను బొలేరో వాహనం ఢీ కొట్టింది. నందికొట్కూరు మండలం నాగటూరుకు చెందిన 15 మంది కూలీలు మిడ్తూరు మండలం పైపాలెం గ్రామానికి వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్తుండగా ఢీ కొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న లీలావతి, వెంకటలక్ష్మమ్మ, నారాయణమ్మ, పక్కీరమ్మ, జయమ్మ, లావణ్యలతో పాటు మరికొందరికి గాయాలయ్యాయి. గాయాలపాలైన మహిళలను నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలపాలైన మరికొందరిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు సమాచారం. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

విద్యుత్ శాఖ ఏఈఈల బదిలీ

కల్లూరు, సెప్టెంబరు 20: జనరల్ బదిలీల్లో భాగంగా పలువురు విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లలను బదిలీ చేస్తూ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష రావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కర్నూలు ఉమ్మడి సర్కిల్లో జే మధుసూదన్ ఏఈఈ కర్నూలు డీపీఈ సబ్ డివిజన్ నుంచి కర్నూలు, జి.శ్రీనివాసరెడ్డి ఏఈఈ కర్నూలు డీపీఈ-1 నుంచి కర్నూలు, కె.వెంకటక్రిష్ణయ్య ఏఈ బి.కోడూరు మండలం కడప నుంచి కర్నూలు, కె.చంద్రశేఖర్ ఏఈ డీపీఈ-1 అనంతపురం నుంయి డీపీఈ-1 ఏఈ-2 కర్నూలు, వీసీ శ్రవణ్ కుమార్‌రెడ్డి ఏఈఈ క్యాంప్స్ నుంచి డీపీఈ-1 ఏఈ-1 కర్నూలుగా బదిలీ చేస్తూ సీఎండీ ఆదేశాలు జారీ చేశారు.

ఎన్నికల షెడ్యూల్ విడుదల

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 20: జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్‌కు గడువు తీరడంతో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు పశుసంవర్ధక శాఖ జేడీ శ్రీనివాస్, షెడ్యూల్ విడుదల చేశారు. ఎన్నికల నిర్వహణ కోసం కర్నూలు డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసన్నబాబును ఎన్నికల అధికారిగా నియమిస్తూ కలెక్టర్ పి.రంజిత్ బాషా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 23న ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తారని, వాటిని పరిష్కరించి ఈ నెల 24న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తామని జేడీ శ్రీనివాస్ తెలిపారు. 26న ఎన్నికల అధికారి నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు. అక్టోబరు 5న నామినేషన్ల స్వీకరణ, 7న పరిశీలన, 8న నామినేషన్ల ఉపసంహరణకు గడువుగా నిర్ణయించినట్లు తెలిపారు. అక్టోబరు 22న 12 డైరెక్టర్ల స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. అదేరోజు డైరెక్టర్లుగా ఎన్నికైన వారితో సమావేశాన్ని నిర్వహించి చైర్మన్, వైస్ చైర్మన్లను సభ్యులు ఎన్నుకుంటారని తెలిపారు.

అన్న క్యాంటీన్లు ప్రారంభం



స్థానికులతో కలిసి అల్పాహారం చేస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 20: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను ఎమ్మిగనూరు పట్టణంలో శుక్రవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ప్రారంభించారు. భారీ జనసందోహం మధ్య సోమప్ప సర్కిల్, శ్రీనివాస సర్కిల్‌లో ఉన్న అన్న క్యాంటీన్లు ప్రారంభం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పలువురికి అల్పాహారం వడ్డించి వారితో కలిసి అల్పాహారాన్ని తిన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ: ఎమ్మిగనూరు పట్టణంలోని సంజీవయ్యనగర్, గోనెగండ్ల బైపాసురోడ్డు, ఎస్ఎంటీ కాలనీతో పాటు ఆయా కాలనీల్లో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీల్లో నెలకొన్న సమస్యలను అడిగి వంద రోజుల పాలన గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆయా వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలకు రూ.1.20 కోట్లతో భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు.

నీతి అయోగ్ సీఈవోను కలిసిన మంత్రి భరత్



నీతి ఆయోగ్ సీఈవోకు దేవుడి బొమ్మను ఇస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 20: ఢిల్లీ పర్యటనలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ నీతి ఆయోగ్ సీవోఓ బీవీఆర్ సుబ్రమణ్యంను కలిశారు. ఉత్పాదక రంగంలో ఆంధ్రప్రదేశ్ సాధించిన ప్రగతి, విజన్ 2047తోపాటు రానున్న ఐదేళ్లలో రాష్ట్రం అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న అభివృద్ధికి సంబంధించి అనేక అంశాలపై వివరంగా మాట్లాడినట్లు మంత్రి తెలిపారు. పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను పెంపొందించడం, పెట్టుబడులను ఆకర్షించడంపై ఆయనతో జరిగిన చర్చ ఎంతో ప్రభావం చూపించిందని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో 2047 విజన్‌తో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ఆర్థిక లోటు ఉన్నప్పటికిప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని మంత్రి వివరించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

బనగానపల్లె , సెప్టెంబరు 20: మండలంలోని నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలుకూరు గ్రామానికి చెందిన అంగజాల ఎల్లసుబ్బయ్య(54) అనే రైతు పొలంలో సేద్యం పనులు చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పొలంలో వ్యవసాయం చేయడానికి ఎద్దులకు ఇనుప గుంటక తగిలిస్తుండగా ప్రమాదవశాత్తూ గుంటకకు పొలంపై వెళ్తున్న విద్యుత్ వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. గాయలకు గురైన ఎల్లసుబ్బయ్యను బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే ఎల్లసుబయ్య మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో మృతుడు ఎల్లసుబ్బయ్య మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతుని కుమారుడు ప్రభాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య శుక్రవారం తెలిపారు.

డోలమైట్ తరలిస్తున్న లారీలు సీజ్

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 20: అక్రమంగా డోలమైట్ ఖనిజాన్ని తరలిస్తున్న రెండు లారీలను సీజ్ చేసి రూ.లక్ష జరిమానా విధించామని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం డోన్ పరిధిలో రెండు లారీలు సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామని చెప్పారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ బాలునాయక్, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

'పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు'



నందికొట్కూరులో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

నందికొట్కూరు, సెప్టెంబరు 20: పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ బేబి కార్మికులను హెచ్చరించారు. శుక్రవారం ఉదయం నందికొట్కూరు పట్టణంలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రతలో కార్మికులే ప్రధాన పాత్ర పోషిస్తారన్నారు. కార్మికులు విధుల పట్ల ఎంత అంకితభావంతో పని చేస్తే పట్టణం అంత శుభ్రంగా ఉంటుందని అన్నారు.

'విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు'



మాట్లాడుతున్న పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డి

నందికొట్కూరు, సెప్టెంబరు 20: బాగా చదువుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని నందికొట్కూరు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని బాలుర హైస్కూల్‌లో శుక్రవారం 'విద్యార్థి చదువుకో గమ్యాన్ని చేరుకో' అన్న అంశంపై అవగాహన కార్యక్రమాన్ని ప్రగతిశీల విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. నందికొట్కూరు పట్టణ సీఐతో పాటు ఎంఈవో సుభాన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి బాగా చదువుకొని ఉన్నత స్థాయిలో చేరుకోవాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. అదే విధంగా విద్యార్థినులు పరిచయం లేని వారితో సోషల్ మీడియాలో చాటింగ్ చేసి వారి ఉచ్చులో పడవద్దని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తినా 100కు డయల్ చేయాలని సీఐ సూచించారు. హెచ్‌ఎం రామిరెడ్డి, బాలికల జూనియర్ కళాశాల, హైస్కూల్ ప్రిన్సిపాల్ పార్వతి, ఫిజిక్స్ లెక్చరర్ ఖాజా హుస్సేన్, పీఎస్‌ఎఫ్ నాయకులు కుమార్, అశోక్, శ్రీకాంత్, రాజా, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

'క్రీడలతో మానసిక ఉల్లాసం'

నంద్యాల రూరల్, సెప్టెంబరు 20: క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక ధృడత్వం కలుగుతుందని ఆర్జీఎం, శాంతిరాం విద్యాసంస్థల ఎండీ మిద్దె శివరామ్ అన్నారు. నంద్యాల మండలంలోని ఆర్జీఎం అంతర్జాతీయ పాఠశాల పదో వార్షికోత్సవం సందర్భంగా విద్యాసంస్థల ఫ్యాకల్టీ స్పోర్ట్స్‌మీట్ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆర్జీఎం అంతర్జాతీయ పాఠశాల క్రీడా మైదానంలో పురుషులు, మహిళలు వివిధ క్రీడా విభాగాలకు సంబంధించిన జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. ఆర్జీఎం ఇంజనీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్ జయచంద్ర ప్రసాద్, శాంతిరామ్ ఇంజనీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం, ఫార్మసీ కాలేజి ప్రిన్సిపాల్ మధుసూదన్‌శెట్టి, శాంతిరాం మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ చౌహాన్, నంద్యాల పబ్లిక్‌స్కూల్ డీన్ ప్రభాకర్‌రెడ్డి, ఆర్జీఎం అంతర్జాతీయ పాఠశాల ప్రిన్సిపాల్ గాయత్రి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అతిథులకు క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించి గౌరవవందనం చేశారు. మిద్దె శివరామ్ క్రీడా జ్యోతిని వెలిగించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు నగదు ప్రోత్సాహకాలు



నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్న డీఎం

ఆత్మకూరు, సెప్టెంబరు 20: ఆత్మకూరు ఆర్టీసీ డిపో పరిధిలో గత ఆగస్టు నెలలో ఉత్తమంగా రాణించిన ఆర్టీసీ ఉద్యోగులకు శుక్రవారం డిపో మేనేజర్ మహేంద్రుడు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ 2024 ఆగస్టు నెలకు సంబంధించి అత్యధిక ఆదాయం సమకూర్చిన కండక్టర్లు జీవీ స్వామి, జీఆర్ఎల్‌రెడ్డి, డీబీ నాయక్, పి.సరస్వతి, కేఎస్ వలి, కె.గోవిందయ్య, ఎస్.ముర్తుజాబీ, జీఆర్ స్వామి, ఎన్.నాగభూషణంకు ప్రోత్సాహక బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. అలాగే అత్యధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు దర్గయ్య, ఖమ్రుద్దీన్, జీవీ రమణ, ఎస్‌కే వలి, ఎం.స్వాములు, బీఎస్ అహ్మద్‌కు ప్రోత్సాహక బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను పంపిణీ చేశారు. మిగతా ఉద్యోగులు వీరిని ఆదర్శంగా తీసుకుని ఆత్మకూరు ఆర్టీసీ డిపోను లాభాల బాటలో నడిపించాలని డీఎం సూచించారు.

'ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలి'



మాట్లాడుతున్న జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాపరెడ్డి

ఆత్మకూరు, సెప్టెంబరు 20: నిరుద్యోగులు ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, జిల్లా ఉపాధి కల్పన అధికారి సోమశివారెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాపరెడ్డి సూచించారు. ఆత్మకూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఆత్మకూరులో నిర్వహించిన జాబ్‌మేళాకు లోకల్ యాప్, ఐసీఐసీఐ బ్యాంకు, మహేంద్ర ఫైనాన్స్, అరబిందో ఫార్మ కంపెనీల ప్రతినిధులు హాజరైనట్లు తెలిపారు. ఈ జాబ్‌మేళాకు మొత్తం 155 మంది అభ్యర్థులు రాగా వారిలో 63 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు వివరించారు. ప్రిన్సిపాల్ జిష్ణు నాగ్ విజయ్, వైస్ ప్రిన్సిపాల్ పద్మావతిబాయి, టీడీపీ పట్టణాధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సుబ్బన్న ఉన్నారు.

మసీదులో అన్నదానం



మసీదులో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

పాణ్యం, సెప్టెంబరు 20: పాణ్యంలోని అయ్యపరెడ్డి కాలనీలోని అల్ నూరానీ మసీదులో శుక్రవారం మిలాద్ ఉన్ నబి మాసోత్సవం సందర్భంగా అన్నదానం నిర్వహించారు. నూరానీ మసీదు నిర్వాహకుడు ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ముస్లీం పెద్దలు, వివిధ గ్రామాల ముస్లీం సోదరులు, అయ్యపురెడ్డి కాలనీ వాసులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- వందరోజుల పాలనలో సక్రమంగా పథకాల అమలు
- 'ఇది మంచి ప్రభుత్వం'లో ప్రజాప్రతినిధులు, అధికారులు



జూపాడుబంగ్లా: 'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 20: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' అనే కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. జూపాడుబంగ్లా మండలంలోని మండ్లెం గ్రామంలో సభ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు వందరోజుల పాలనలో పించన్ల పెంపు, మెగా డీఎస్సీ, అన్న క్యాంటీన్లు, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు తదితర కార్యక్రమాలు చేపట్టడంతో ప్రజలే ఇది మంచి ప్రభుత్వం అంటున్నారని అన్నారు. చేసిన పనులను, చేయాల్సిన పనులను ప్రజలవద్దకే వెళ్లి చేస్తున్నామన్నారు. మంచి పనులు చేసిన చంద్రబాబు గురించి ప్రజల్లోకి తీసుకుపోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సిన అధికారులు గైర్హాజరుకావడంతో ఎంపీడీవో నూర్జహాన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లుయాదవ్ , గిరీశ్వరరెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాసులు, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, రామోహ్మన్‌రెడ్డి, రవికుమార్ యాదవ్, పెద్దన్న, సుధాకర్, సర్పంచులు కృపమ్మ, బాలమద్దిలేటి, బాలయ్య, బీజేపీ నాయకుడు దామోదర్‌రెడ్డి, జనసేన నాయకులు రవికుమార్, అధికారులు పాల్గొన్నారు.

మిడుతూరు: నాగలూటి గ్రామంలో ఇది మన మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎంపీడీవో నాగేశాచల రెడ్డి, టీడీపీ నాయకుడు రవీంద్ర బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం'



వెలుగోడు: వేల్పనూరులో..



గోస్పాడులో..

పోస్టర్లు పంపిణీ చేశారు. ఈవోఆర్డీ ఫక్రుద్దీన్, ఏపీడీ బాలాజి నాయక్, ఏపీవో జయంతి, పంచాయతీ కార్యదర్శి రవీంద్ర, నాయకులు రమణారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పగిడ్యాల: సంకిరేణిపల్లె, తూర్పు వనములపాడు గ్రామంలో ఇన్‌చార్జి ఎంపీడీవో నాగరాజు, గ్రామ నాయకుల ఆధ్వర్యంలోఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ ప్రత్యేకాధికారి శేషమ్మ, ఈవోఆర్డీ నాగేంద్రమయ్య, ఏపీవో మద్దిలేటి, టీడీపీ నాయకులు శ్రీను, ఎల్లయ్య, పంచాయతీ కార్యదర్శి కోట్ల వెంకట్ తదితరులు ఉన్నారు.

గడివేముల: బూజనూరు గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. హౌసింగ్ ఏఈ సత్యనారాయణమూర్తి, టీడీపీ నాయకులు దిలీప్‌కుమార్‌రెడ్డి, చిన్నముని శేషిరెడ్డి, రామకృష్ణారెడ్డి, నాగేశులు పాల్గొన్నారు.

గోస్పాడు: జూలెపల్లె, దీబగుంట్ల గ్రామాలలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో నాగఅనసూయ, ఏపీఎం రామశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు గోకులరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: పార్నపల్లె, ఎర్రగుంట్ల, లింగాపురం గ్రామాల్లో శుక్రవారం కార్యక్రమాన్ని మండల స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్ రెహమాన్, ఎంపీడీవో వాసుదేవ గుప్తా 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని



మిడుతూరు: నాగలూటి గ్రామంలో..



బండిఆత్మకూరు: పార్నపల్లెలో..

నిర్వహించారు. స్టిక్కర్లు, బ్రోచర్లు పంపిణీ చేశారు.

మహానంది: నందిపల్లిలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఉల్లి మధు, యూనిట్ ఇన్ చార్జిలు మౌళీశ్వరరెడ్డి, శ్యామల జనార్దన్‌రెడ్డి, నాయకులు మహేశ్వర రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, చెన్నయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య పాల్గొన్నారు.

వెలుగోడు: వేల్పనూరు గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో అమానుల్లా, టీడీపీ నాయకులు పోతం క్రిష్ణారెడ్డి, అన్నారపు శంకర్‌రెడ్డి, అంకిరెడ్డి, శంకర్‌రెడ్డి, పరమేశ్వరరెడ్డి, అభిమానులు, సిబ్బంది పాల్గొన్నారు.



పగిడ్యాల: సంకిరేణిపల్లెలో..



మహానంది: నందిపల్లిలో..



గడివేముల: బూజనూరులో..

నిత్యాన్నదాన పథకానికి విరాళం



దాతకు ప్రసాదం అందజేస్తున్న పర్యవేక్షకుడు మధుసూదన్‌రెడ్డి

శ్రీశైలం, సెప్టెంబరు 20: శ్రీశైలం దేవస్థానం భక్తుల కోసం నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకానికి ఏలూరుకు చెందిన కేవీ ప్రభాకరకుమార్ కుటుంబ సమేతంగా కలిసి రూ.1,11,116 అందజేశారు. దాత ఈ విరాళాన్ని పర్యవేక్షకుడు మధుసూదన్‌రెడ్డికి అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేసి సత్కరించారు.

'రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు అమానుషం'

ఆత్మకూరు, సెప్టెంబరు 20: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీపై బీజేపీ నేత తన్విందర్ సింగ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం అమానుషమని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఇబ్రహీం, నియోజకవర్గ సమన్వయకర్త శ్రీనివాసగౌడ్ అన్నారు. శుక్రవారం ఆత్మకూరు అర్బన్ సీఐ ఓబులేసును కలిసి బీజేపీ నేత తన్విందర్‌పై ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. బీజేపీ, మిత్రపక్షాలు దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడాన్ని రాహుల్‌గాంధీ ప్రశ్నించడంతో జీర్ణించుకోలేక ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నాయకులు ఖాదర్, నూర్‌బాషా తదితరులు ఉన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతికి సంతాపం

బండిఆత్మకూరు, సెప్టెంబరు 20: మండలంలోని ఎ.కోడూరు మాజీ ఎంపీటీసీ మబ్బు దేవదాసు మృతి పట్ల టీడీపీ నాయకుడు వడ్డు మధుసూదన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం అర్ధరాత్రి దేవదాసు మృతి చెందారు. శుక్రవారం విషయం తెలుసుకున్న మధుసూదన్‌రెడ్డి మాజీ ఎంపీటీసీ మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. అంతిమ సంస్కారాలకు తన వంతుగా రూ.5వేలు నగదును అందజేశారు.

'దోషులను కఠినంగా శిక్షించాలి'

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 20: పరమ పవిత్రంగా స్వీకరించే లడ్డును అపవిత్రం చేయటంపై సరైన న్యాయ విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి నగరడోణ సుధీర్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానంలో అత్యంత పవిత్రమైన, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుపతి లడ్డును తయారుచేయడంలో నాసిరకం, చేప, ఆవు కళేబరాలతో తయారుచేసిన నూనెను ఉపయోగిస్తున్నారన్న వార్త కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. కావున తిరుపతి లడ్డును అపవిత్రంగా చేయకుండా, అపవిత్రం చేసేవారిపై న్యాయవిచారణ చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

గడివేముల, సెప్టెంబరు 20: మండలంలోని కరిమద్దెల హైస్కూల్ విద్యార్థులు సాయిమణి, మోహిణి 38వ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు సబ్ జూనియర్ విభాగంలో ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు బాల వెంకటేశ్వర్లు తెలిపారు. వీరు కడప జిల్లా వేంపల్లిలో ఈనెల 21, 22 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీలో ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు ప్రతాప్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

మెడికల్ విద్యార్థులకు కలెక్టర్ అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 20: చిన్నటేకూరుకు చెందిన ఐఐటీ మెడికల్ అకాడమీలో 2024-25 విద్యా సంవత్సరంలో శిక్షణ పొంది మెడికల్ సీట్లు పొందిన మనోజ్, అబ్రహం, అరుణ్‌కుమార్, ఉమేష్‌కుమార్‌లు, కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ రాజకుమారిని శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి వీరిని అభినందించారు.

సమాచారం లేకుండానే మూసిన రైల్వే గేట్

- ఇబ్బందులు పడ్డ వాహనదారులు



గాజులపల్లి రైల్వే స్టేషన్ ప్రధాన రహదారిలో మూసిన రైల్వే గేటు

మహానంది, సెప్టెంబరు 20: ప్రజలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ప్రధాన రహదారిలోని రైల్వేగేటును ట్రాక్ మరమ్మతుల పేరుతో రైల్వే అధికారులు మూసి వేశారు. శుక్రవారం మహానంది మండలం గుంటూరు- గుంతకల్లు మార్గంలోని గాజులపల్లి ఆర్ఎస్ సమీపంలోని ప్రధాన రహదారి ట్రాక్ మరమ్మత్తు పనులను భాగంగా సిబ్బంది నిర్వహించారు. దీంతో ఉదయం నుంచి రైల్వే గేట్‌ను మూయడంతో ఆ రహదారిలో మహానందికి వచ్చే భక్తుల వాహనదారులతో పాటు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీంతో విసుక్కుంటూ నందిపల్లి మీదుగా వాహనదారులు మహానందికి వచ్చారు. దీనిపై రైల్వే అధికారులు మాట్లాడుతూ ప్రధాన గేట్ వద్ద ట్రాక్ ఆధునికీకరణలో భాగంగానే రైల్వే గేటును మూసివేసినట్లు చెప్పారు. శనివారం నుంచి గేటును తెరిచి యథావిధిగా రాకపోకలకు అంతరాయం లేకుండా చేస్తామని తెలిపారు.

సీఎం సహాయ నిధికి విరాళం

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 20: వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు జూపాడు బంగ్లా మండలంలోని డా.బీ.ఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, వైస్ ప్రిన్సిపాల్ మూర్తి, ఉమామహేశ్వరప్ప, సిబ్బంది, విద్యార్థులు కలిసి స్వచ్ఛందంగా రూ.11,675 కలెక్టర్ రాజకుమారికి చెక్కురూపంలో అందజేశారు.

'చీడపీడల నివారణతో అధిక దిగుబడి'



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

నంద్యాల రూరల్, సెప్టెంబరు 20: పంటలో చీడపీడల నివారణతో అధిక దిగుబడులు సాధించవచ్చని నంద్యాల సహాయ సంచాలకుడు రాజశేఖర్ తెలిపారు. అయ్యలూరు గ్రామంలో పీడీఎస్ఎస్ అనే దరఖాస్తు ద్వారా పంటలో చీడపీడల వ్యాధి నిర్ధారణ వ్యవస్థ పనితీరును ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ఈ దరఖాస్తును వాడడం ద్వారా పంటలో చీడపీడల నిర్ధారణ చేసుకుని సస్య రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం పిలక దశలో ఉన్న వరి పొలాలలో మిత్రపురుగులైనా సాలెపురుగులు, తూనిగలు ఉండడం వల్ల ఎలాంటి మందులు పిచికారి చేయాల్సిన అవసరం ఉండదన్నారు. ఎరువులు కూడా తగిన మోతాదులోనే వాడాలన్నారు. నత్రజని ఎరువులు ఎక్కువగా వాడడం వల్ల మొక్కలను చీడపీడలు త్వరగా ఆకర్షిస్తాయని చెప్పారు. వరి చిరుపొట్ట దశలో ఉన్నప్పుడు నత్రజనితో పాటు పొటాష్ వాడడం వల్ల మొక్కలకు వ్యాధి నిరోధక శక్తిపెరిగి చీడపీడలను తట్టుకోగలదన్నారు. ఏవోప్రసాదరావ్, ఏఈవో ముక్తార్‌బాషా, వీఏఏలు షర్మిల, అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు

గడివేముల, సెప్టెంబరు 20: గడివేముల జడ్పీహైస్కూల్‌లో ఎస్‌జీఎఫ్‌ఐ క్రీడా పోటీలు శుక్రవారం హోరాహోరీగా జరిగాయి. క్రీడలను ఎంఈవో విమల వసుంధరాదేవి ప్రారంభించారు. అండర్-14, 17 విభాగాల్లో సుమారు 300 మంది క్రీడాకారులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొన్నారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను పాణ్యం నియోజకవర్గ క్రీడా పోటీలకు ఎంపిక చేసినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు భుజంగరావు తెలిపారు.

కొత్తపల్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయిలలో ప్రతిభ కనబరచాలని ఎంపీడీవో మేరీ సూచించారు. శుక్రవారం కొత్తపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్‌లో మొదటి రోజు 68వ స్కూల్ గేమ్స్‌లో భాగంగా మండల స్థాయి గేమ్స్‌ను ప్రారంభించారు. ఈ పోటీలను ఎంపీడీవో మేరీ, ఎస్ఐ కేశవ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ క్రీడల్లో కొత్తపల్లి మండలానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. ఎస్ఐ కేశవ మాట్లాడుతూ విద్యార్థులు కష్టమైనా ఇష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. సర్పంచ్ లక్ష్మీదేవి, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఎస్‌జీఎఫ్ మండల కోఆర్డినేటర్ మురళి నాయక్, వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రశేఖర్, సుంకన్న, స్వప్నశ్రీ, రీనాభేగంతో పాటు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మిడుతూరు: మిడుతూరు గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన అండర్ 14, అండర్ 17 క్రీడలు రెండు రోజులపాటు ఉత్సాహంగా జరిగాయి. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంఈవో శ్రీనాథ్, హెచ్‌ఎంలు సాయి తిమ్మయ్య, ఉమాశంకర్, టీడీపీ నాయకుడు తువ్వా భగీరథ రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వెంటేశ్వర్లు, పీఈటీ అరుణ, పీఈటీలు పాల్గొన్నారు.

మహానంది: మండలంలోని తిమ్మాపురం జడ్పీ పాఠశాలలో శుక్రవారం అట్టహాసంగా క్రీడా పోటీలు జరిగాయి. ఎంఈవో రామసుబ్బయ్య పోటీలను ప్రారంభించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాల బాలికలకు అండర్-14,అండర్-17 విభాగాల్లో ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంఈవో తెలిపారు. జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మెదటి రోజు విద్యార్థులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బాల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్, చెస్, పోటీలను నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయిలు పాల్గొన్నారు.

వైభవంగా ఊయల సేవ

శ్రీశైలం, సెప్టెంబరు 20: శ్రీశైలం మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ఊయలసేవను ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ముందుగా మహాగణపతి పూజను చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊయలలో ఆశీనులనుజేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు. అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్ర నామపూజలు, స్వామివారికి సహస్రనామార్చన పూజలు నిర్వహించి మంగళహారతులను సమర్పించారు.

- శ్రీశైల క్షేత్ర గ్రామదేవత అంకాలమ్మకు శుక్రవారం లోకకల్యాణాన్ని ఆకాంక్షిస్తూ విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. ఈ పూజల్లో భాగంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, విశేష అలంకరణ, కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

ఆకట్టుకున్న నిత్య కళారాధన

శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో శుక్రవారం తిరుపతికి చెందిన కొండా రవికుమార్ బృందంచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వినాయకస్తుతి, శివ శివ భవ భవ, భో..శంభో శివ..శంభో, ఆనందతాండవం, సప్తతాండవ వేదం, దేవీస్తుతి తదితర గీతాలకు కళాకారులు నృత్యప్రదర్శనతో అలరించారు.



ఊయల సేవ నిర్వహిస్తున్న వేద పండితులు



నృత్యం చేస్తున్న కళాకారులు

మహానందిలో పల్లకీ ఉత్సవం



పల్లకీ ఉత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

మహానంది, సెప్టెంబరు 20: మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి పల్లకీ ఉత్సవాన్ని ఆలయ వేదపండితులు, అర్చకులు ఘనంగా నిర్వహించారు. పల్లకిలో ఉత్సవమూర్తుల విగ్రహాలను ఆశీనులు గావించారు. వేదమంత్రాలతో స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ మెదటి ప్రాకారంలో భక్తుల శివనామస్మరణ మధ్య పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

క్రమ శిక్షణతోనే ఉజ్వల భవిష్యత్: డీఎస్పీ



గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 20: క్రమ శిక్షణతో మెలిగితేనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్ అన్నారు. శుక్రవారం కొలిమిగుండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంటర్ దశ విద్యార్థి జీవితంలో కీలకమైందన్నారు. కార్యక్రమంలో సీఐ రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే చర్యలు: గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్ హెచ్చరించారు. కొలిమిగుండ్ల మండలంలోని చింతలాయపల్లె గ్రామంలో ఇటీవల టీడీపీ-వైసీపీ వర్గాల గొడవల నేపథ్యంలో ఇరుపార్టీల నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆధిపత్యం కోసం గ్రామాల్లో గొడవలు సృష్టించడం తగదన్నారు. అదేవిధంగా అంకిరెడ్డిపల్లె గ్రామంలో కూడా గ్రామ పెద్దలతో సమావేశమయ్యారు.

కౌలు రైతు ఆత్మహత్యపై విచారణ

కోవెలకుంట్ల, సెప్టెంబరు 20: మండలంలోని కలుగొట్ల గ్రామానికి చెందిన రామానాయుడు అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. దీనిపై శుక్రవారం డోన్ ఆర్డీవో మహేశ్వరెడ్డి, తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి, ఏవో నిరంజన్, ఎస్‌ఐ భూపాలుడులు కలుగొట్లకు చేరుకుని విచారణ చేపట్టారు. రామానాయుడు తనకున్న 52 సెంట్ల పొలంతోపాటు సుమారు ఐదెకరాలు కౌలు తీసుకుని మిరప, వరి సాగు చేశారు. పంటల సాగు కోసం సుమారు రూ.10 లక్షలు అప్పు చేశారు. పంట సరిగా పండక నష్టం రావడంతో అప్పులు తీర్చలేక బాకీదారులు ఒత్తిడి తీరక మనస్తాపంతో ఆగస్టు 30న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు విచారణలో తేలిందన్నారు. నివేదిక తయారు చేసి కలెక్టరుకు పంపిస్తామని తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

బనగానపల్లె, సెప్టెంబరు 20: మండలంలోని నందివర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని కైప గ్రామానికి చెందిన మోదీన్‌షా హుసేన్ బాషా (37) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు నందివర్గం ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య శుక్రవారం తెలిపారు. గ్రామంలో అతనికి అప్పులు అధికం కావడంతో అప్పులు తీర్చే మార్గం లేకి మనస్తాపంతో విషద్రావణం తాగినట్లు తెలిపారు. మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి భార్య నూరూన్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

శిరివెళ్ల, సెప్టెంబరు 20: కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిపై శిరివెళ్ల మెట్ట సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. శిరివెళ్ల పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని గుంప్రమాన్‌దిన్నె గ్రామానికి చెందిన బాల లింగమయ్య ద్విచక్రవాహనంపై నంద్యాల నుంచి స్వగ్రామానికి వస్తుండగా శిరివెళ్ల మెట్ట సమీపంలో గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఢీకొనడంతో బాల లింగమయ్య (35) అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ చిన్న పీరయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పంచనామా నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

సమస్యలన్నీ పరిష్కరిస్తా

గుళ్లదుర్తి గ్రామంలో పర్యటించిన మంత్రి బీసీ

కోవెలకుంట్ల, సెప్టెంబరు 20: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ పరిష్కరిస్తానని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. మండలపరిధిలోని గుళ్లదుర్తి గ్రామంలో కూటమి ప్రభుత్వం వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా 'ఇది మంచి ప్రభుత్వం' ప్రజా వేదిక సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి బీసీతో పాటు కలెక్టర్ రాజకుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు సమస్యలను ప్రజలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలో బీసీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులకు మరుగుదొడ్లు సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆ సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు మంత్రి దృష్టికి తేవడంతో మంత్రి తన సొంత నిధులు రూ.2లక్షలు అందించి సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ పనుల నిమిత్తం విద్యుత్‌లో ఏవైనా అంతరాయాలు ఏర్పడినా విద్యుత్ సమస్య పరిష్కరించాలని సబ్‌స్టేషన్ వద్దకు వెళ్తే అధికారులు పట్టించుకోవడం లేదంటూ ప్రజలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే మంత్రి సంబంధిత ఏడీ, ఏఈని పిలిపించి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామానికి చెందిన అమ్మభగవాన్ పొదుపు గ్రూపు మహిళలు గ్రామంలో నిర్వహిస్తున్న ఇది మంచి ప్రభుత్వం.. కార్యక్రమంలో మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పొదుపు మహిళలు బ్యాంకు నుండి రూ.15లక్షలు రుణం తీసుకున్నారని, అయితే కంతులు 24 కట్టాల్సి ఉండగా 12 కంతులు చెల్లించగానే తమకు తెలియకుండా బ్యాంకు అధికారులు రెన్యువల్ చేసి అదనంగా రూ.40వేలు వడ్డీ కట్టాలని అంటున్నారని ఇదేమని ప్రశ్నిస్తే పై అధికారులు జారీ చేశారని అందువల్లనే వేశామని అంటున్నారని ఈ సమస్య పరిష్కరించాలని మంత్రి దృష్టికి తెచ్చారు. సంబంధిత ఏపీయంను పిలిపించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఉమాకాంత్‌రెడ్డి, పీఆర్‌డీఈ నాగశ్రీనివాసులు, ఎంపీడీవో సయ్యదున్నీసా, తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి, టీడీపీ నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, గోవర్ధనరెడ్డి, రవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: రాష్ట్రంలోని ప్రజలు, రైతుల సంక్షేమమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రెహిమాన్‌పురం గ్రామంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం మండల విద్యాధికారి సోమశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డోన్ ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన సమయంలో రాష్ట్రం సంక్షోభంలో ఉండగా.. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజా సంక్షేమానికి కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఎల్లనాగయ్య, సీనియర్ నాయకురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, మాజీ ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి, బుగ్గన ప్రభాకర్ రెడ్డి, తహసీల్దార్ ప్రకాష్‌బాబు పాల్గొన్నారు.

సంజామల: కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి అయిన సందర్భంగా సచివాలయ సిబ్బంది కరపత్రాలను పంపిణీ చేశారు. శుక్రవారం ఎగ్గోని గ్రామ టీడీపీ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, ప్రసాద రెడ్డి సచివాలయ సిబ్బందితో కలిసి వంద రోజుల్లో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. పంచాయతీ కార్యదర్శి దినేష్, వ్యవసాయ సహాయకులు సురేంద్ర, మహ బూబ్ బేగ్, డిజిటల్ అసిస్టెంట్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: మండంలోని అన్ని గ్రామాల్లో ప్రజా వేదిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో ఉమమహేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఇంజేడు గ్రామంలో ప్రజా వేదిక నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వంద రోజుల్లో ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలు గురించి వివరించారు. అనంతరం ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. సర్పంచ్ జైనాబీ, ఈవోపీఆర్డీ మహేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

చాగలమర్రి: చంద్రబాబు పాలనలోనే పేదలకు న్యాయం జరుగుతుందని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, బీసీ సెల్ నంద్యాల అధికార ప్రతినిధి సల్లానాగరాజు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం చాగలమర్రి గ్రామంలో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లను అంటించి ప్రభుత్వ పాలన గురించి తెలియజేశారు. ఈవోపీఆర్డీ తాహిర్‌హుసేన్, టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకులు మౌళాలి, అనీఫ్, నాగరాజు, గౌస్‌మోహిద్దీన్, గఫార్, అబ్దుల్‌ఖాదర్, భాస్కర్‌రెడ్డి, మహబూబ్‌బాషా, మురళి, ఓబులేసు, రాజేష్, ఫరూక్, ఉసేన్‌పీరా, జోసఫ్ పాల్గొన్నారు.

● రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వందరోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రవేశ పెట్టిన ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను శుక్రవారం చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా బీసీ కార్పోరేషన్ ఈడీ జాకిర్‌హుసేన్, ఎంపీడీవో మహబూబ్‌లు ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్, ఏపీవో నిర్మల, కోఆర్డినేటర్ రాజ్‌కుమార్, మండల సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రవరం: ఏపీ సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకులు నాగిరెడ్డి, నాగ నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం దక్షిణకొట్టాల గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాలను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పుల్లారెడ్డి, నాగేంద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, కార్యదర్శి కొండయ్య పాల్గొన్నారు.

డోన్(రూరల్): టీడీపీ కూటమి ప్రభుత్వంలో ప్రజలకు అందిస్తున్న సంక్షేమ ఫలాలపై పట్టణంలోని పలు వార్డులలో టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేసి వివరించారు. పట్టణంలోని కొత్తపేట, 2వ వార్డులో చికెన్ రాజు ఆధ్వర్యంలో వంద రోజుల సంక్షేమ పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమాన్ని గురించి వివరించారు. అలాగే పట్టణంలోని 14, 15, 17 వార్డులలో టీడీపీ యువ నాయకుడు రాఘవేంద్రగౌడు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల పాలనపై గ్రామాల్లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మంచి ప్రభుత్వం కార్యక్రమంలో శుక్రవారం మండల అధికారులతో పాటు టీడీపీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బెలుంశింగవరం గ్రామంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రమణ్యం, టీడీపీ నాయకులు డి. శంకరరెడ్డి, కట్టుబడి రామ్మోహన్, వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీ అధికారులు 100 రోజుల్లో జరిగిన మంచిని వివరించారు.

అవుకు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలన 100 రోజులు పూర్తయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి శుక్రవారం తెలిపారు. మండలంలోని అన్నవరం, వేములపాడు, చనుగొండ్ల గ్రామ పంచాయతీల్లోని ప్రజలకు సచివాలయ సిబ్బంది పర్యటించారు.



గుళ్లదుర్తిలో 'ఇది మంచి ప్రభుత్వం' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



రెహిమాన్‌పురంలో మాట్లాడుతున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల



చాగలమర్రిలో అవగాహన కల్పిస్తున్న టీడీపీ నాయకులు



రుద్రవరం మండలం దక్షిణ కొట్టాలలో..



డోన్‌లో..



అవుకు మండలం అన్నవరంలో..



బెలుం శింగవరంలో..

'వైసీపీ హయాంలో మా ఆస్తులపై కుట్ర'

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), సెప్టెంబరు 20: వైసీపీ హయాంలో మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ఏవీ సుబ్బారెడ్డి కుమ్మక్కై ఆళ్లగడ్డలోని తమ ఆస్తులపై కుట్ర చేశారని దివంగత టీడీపీ నాయకురాలు అట్లా శ్రీదేవి వారసులు అట్లా హర్షవర్ధన్‌రెడ్డి, అట్లా రమ్య శుక్రవారం ఆరోపించారు. పాతబస్టాండ్ సమీపంలో తమ పూర్వీకులకు చెందిన ఓ స్థలానికి ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి కబ్జా చేశారని.. ఇదంతా ఏవీ సుబ్బారెడ్డి వెనుక ఉండి నడిపిస్తున్నారని వారు ఆరోపించారు. ఆళ్లగడ్డలో వివాదాస్పదంగా మారిన ఓ చికెన్ దుకాణం వద్ద శుక్రవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. చికెన్ దుకాణాన్ని దౌర్జన్యంగా ఖాళీ చేయించామని వడగళ్ల ఈశ్వరమ్మ అనే వృద్ధురాలు ఎస్పీని ఆశ్రయించి ఫిర్యాదు చేసిన విషయంలో వాస్తవం లేదన్నారు. ఆ ఆస్తికి సంబంధించిన నిజమైన వారసులం తామేనని, తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని వారు తెలిపారు. తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ వద్దకు వెళ్లామని.. ఈ ఘటనలో ఎమ్మెల్యే అఖిలప్రియ దంపతులపై బురద జల్లేందుకు యత్నించడం సమంజసం కాదని అన్నారు. ఆళ్లగడ్డలో ఓ చిన్న చికెన్ దుకాణానికి సంబంధించి ఇంత చొరవ చూపుతున్న పోలీసులు.. మా అమ్మ అట్లా శ్రీదేవి హత్య కేసులో నిందితుడైన ఏవీ సుబ్బా రెడ్డిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.



ఆళ్లగడ్డలో ఆధారాలు చూపుతున్న అట్లా శ్రీదేవి వారసులు

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్న ప్రభుత్వం: ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), సెప్టెంబరు 20: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు తన దార్శనిక పాలనతో సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని ఓ పక్కన గాడిన పెడుతూనే మరో వైపు అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం పేరుతో నియోజకవర్గంలోని మండలాల్లో పర్యటించనున్నట్లు అఖిలప్రియ తెలిపారు. ఈ నెల 23న సాయంత్రం శిరివెళ్లలో, 24న ఉదయం ఆళ్లగడ్డ అర్బన్ పరిధిలో, సాయంత్రం దొర్నిపాడులో, 25న ఉదయం రుద్రవరంలో, సాయంత్రం ఉయ్యాలవాడలో, 26న ఉదయం ఆళ్లగడ్డ మండలం బాచేపల్లె గ్రామంలో, సాయంత్రం చాగలమర్రిలో ప్రజలతో మమేకం కానున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

'జీవో నెంబరు 85ను ఉపసంహరించుకోవాలి'

శిరివెళ్ల, సెప్టెంబరు 20: గవర్నమెంట్ సర్వీసులో ఉన్న వైద్యులు పీజీ విద్యను అభ్యసించేందుకు అమలు చేస్తున్న సర్వీస్ కోటాను తగ్గించేలా తెచ్చిన జీవో నెంబరు 85ను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని శిరివెళ్ల పీహెచ్‌సీ వైద్యులు ముఖేష్ కుమార్, దివ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుల సంఘం పిలుపు మేరకు వైద్యులు విధులను బహిష్కరించి శాంతియుతంగా సమ్మె కొనసాగిస్తున్నామన్నారు. పీహెచ్‌సీ వైద్యులకు పదోన్నతులు, గిరిజన ప్రాంతాల్లో పని చేస్తున్న వైద్యులకు ప్రోత్సాహక అలవెన్సులు, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంకు సంబంధించిన అలెవెన్సులు చెల్లించాలన్నారు. 2020 వైద్యుల నోషనల్ ఇంక్రిమెంట్లను ఇవ్వాలన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జరిమానా

బనగానపల్లె , సెప్టెంబరు 20: మండలంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇరువురు ఆటోడ్రైవర్లను బనగానపల్లె కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ షేక్ అబ్దుల్ రహిమాన్ ఇరువురికి రూ.15 వేలు జరిమానా విధించి నట్లు బనగానపల్లె పట్టణ సీఐ కృష్ణయ్య శుక్రవారం తెలిపారు. మండలంలోని మీరాపురం గ్రామానికి చెందిన తిమ్మరాజు కుమారుడు చల్లావడ్డే సాయికుమార్, దస్తగిరి కుమారుడు సాహెబ్‌గారి హుసేన్ వలి మద్యం సేవించి ఆటోలు నడుపుతుండగా ఇరువురిని పట్టణ శివారులోని సాయిబాబా ఆలయం సమీపంలో తనిఖీలు సేవించి మద్యం సేవించి నిర్ధిరించి కోర్టులో హాజరు పరచామని అన్నారు. జడ్జి చల్లా వడ్డే సాయికుమార్‌కు రూ.10వేలు, సాహెబ్‌గారి హుసేన్ వలికి రూ.5వేలు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

'పౌష్టికాహారంతో ఆరోగ్యం'



గర్భిణులకు సూచనలిస్తున్న సీడీపీవో తేజేశ్వరి

దొర్నిపాడు, సెప్టెంబరు 20: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో తేజేశ్వరి అన్నారు. దొర్నిపాడు గ్రామంలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవం కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాసులు, కృషి విజ్ఞాన కేంద్రం సైనింటిస్టు లక్ష్మీదేవి గర్భిణులు ప్రతి నెలా వైద్యులను సంప్రదించాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను పరిశీలించారు. ఎంఈవో రామచంద్రయ్య, జడ్పీటీసీ శకుంతలమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, గర్భిణులు ఉన్నారు.

సంజామల: పౌష్టికాహారంతో రక్తహీనత దూరమవుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంత అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాలు పురస్కరించుకొని శుక్రవారం ఆకుమళ్ల అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు.

మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలి

డోన్(రూరల్), సెప్టెంబరు 20: మూఢ నమ్మకాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి అన్నారు. పట్టణంలోని పాతపేట జడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 25న జరిగే చెకుముఖి సైన్స్ టాలెంట్‌కు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మావతమ్మ, సీనియర్ ఉపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

ప్యాపిలి, సెప్టెంబరు 20: మండలంలోని డి.రంగాపురం సమీపంలోని కొండ ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకున్న నాటుసారా స్థావరాలపై శుక్రవా రం జలదుర్గం ఎస్‌ఐ నాగార్జున ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 20 సారా బట్టీలను ధ్వంసం చేశారు. అలాగే 2500 లీటర్ల బెల్లం ఊటను నేల పాలు చేయడంతోపాటు వంద లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా బట్టీలను నిర్వహిస్తున్న ఈశ్వరయ్య, శంకర్‌లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

డోన్‌లో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

డోన్(రూరల్), సెప్టెంబరు 20: పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు మొదలయ్యాయి. ఇప్పటికే పట్టణ పోలీస్ స్టేషన్‌లో అవుట్‌పోస్టు పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. అలాగే పట్టణంలోని ప్రధాన రోడ్డు మీదుగా వెళ్లిన ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద అక్రమ కట్టడాల వల్ల ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుందని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు గుర్తించారు. అక్రమ కట్టడాలను కూల్చివేత ప్రక్రియ మొదలైంది. పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా, ఎస్‌ఐ సిబ్బందితో ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఉన్న అక్రమ కట్టడాలను తొలగిస్తూ ట్రాఫిక్ నియంత్రణకు, బైక్ పార్కింగ్‌లకు ప్రణాళికలు చేస్తున్నారు.

'విద్యాభివృద్ధికి కృషి చేయాలి'

చాగలమర్రి, సెప్టెంబరు 20: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈవో అనూరాధ తెలిపారు. మండలంలోని పెద్దబోదనం, చిన్నబోదనం ప్రాథమిక పాఠశాలను శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థుల గ్రేడింగ్, రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, సీఆర్పీ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగి మృతి

చాగలమర్రి, సెప్టెంబరు 20: చాగలమర్రి గ్రామంలో నివాసం ఉంటున్న వ్యవసాయ విశ్రాంత ఉద్యోగి ఉసేన్‌సా (72) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. వ్యవసాయ విస్తరణాధికారిగా విధులు నిర్వహించారు. టీడీపీ నాయకులు ఆయన మృతికి సంతాపం తెలిపారు. కుటుంబానికి సానుభూతి తెలిపారు.

పాముకాటుకు మహిళ మృతి

చాగలమర్రి, సెప్టెంబరు 20: మండలంలోని ముత్యాలపాడు గ్రామానికి చెందిన మహిళ ఉసేనమ్మ (35) పాముకాటుకు గురై శుక్రవారం మృతి చెందారు. ఉసేనమ్మ చాగలమర్రి గ్రామంలోని ఓ రైతు పొలంలో పనులు చేస్తుండగా పాముకాటుకు గురైంది. ఉసేనమ్మ పొలంలోనే కుప్పకూలడంతో పక్కనే ఉన్న కూలీలు చికిత్స నిమిత్తం స్థానిక కేరళ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు సంతానం ఉన్నారు.

కొత్త ఆలోచనలతోనే ఆవిష్కరణలు

రుద్రవరం, సెప్టెంబరు 20: కొత్త ఆలోచనలే కొత్త ఆవిష్కరణలకు తెర తీస్తుందని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్ర స్థాయి బూట్ క్యాంపునకు రుద్రవరం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, విద్యార్థి సాయి తేజ ఎంపికయ్యారు. ఐడీ ఈ బూట్ క్యాంపు నందు తేలేప్రోలులో వర్క్‌షాపులో పాల్గొన్నారు. ఈ క్యాంపులో ఇన్నోవేషన్, డిజైన్ ఇంటర్ పేన్యూర్ చీఫ్ వర్క్‌షాపులో పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. తేల్లప్రోలు ఉషారమ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఈ వర్క్‌షాపులో నాలుగు పాఠశాలలు ఎంపిక చేసినట్లు తెలిపారు.

అన్ని రంగాల్లో విద్యార్థులు ముందుండాలి



నమూనాలను పరిశీలిస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, సెప్టెంబరు 20: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో ముందుండి దేశాభివృద్ధికి సహకరించాలని బనగానపల్లె రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ అన్నారు. శుక్రవారం బనగానపల్లె పట్టణంలోని మోడల్‌స్కూల్‌లో ప్రిన్సిపాల్ రామలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులచే వివిధ రకాల ప్రాజెక్టులను రూపకల్పన గావించారు. వీటిని ఇందిరమ్మ సందర్శించి విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కుటుంబం ఎప్పటికీ ప్రజలందరికీ సేవ చేస్తూనే ఉంటుందన్నారు.

తాగునీటి మళ్లింపులో వివాదం

సంజామల, సెప్టెంబరు 20: హోత్రమాన్‌దిన్నె గ్రామంలో తాగునీటిని మళ్లిస్తుండగా పక్క పొలంలో నీరు చేరిన విషయంలో గొడవపడి దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్.ఐ రమణయ్య శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన బైరి రవి తనకున్న వ్యవసాయ భూమికి సాగునీరు మళ్లిస్తుండగా పక్కన ఉన్న తలారి జయన్న భూమిలోకి తాగునీరు చేరుకుంది. ఈ వివాదంలో బైరి రవిని తలారి జయన్నను నానా దుర్భాష లాడి దాడి చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు బైరి రవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ వివరించారు.

ఘనంగా ఉరుసు

రుద్రవరం, సెప్టెంబరు 20: మండలంలోని యల్లావత్తుల గ్రామంలో శుక్రవారం రాత్రి అల్లీషా తాత ఉరుసు నిర్వహించినట్లు ముతవల్లి మదార్‌వలి తెలిపారు. యల్లావత్తుల గ్రామంతో పాటు తుమ్మలకొట్టాల, శ్రీరంగాపురం, డి.కొట్టాల గ్రామలా నుంచి భక్తులు తరలివచ్చి అలీసాతాత దర్గాను దర్శించుకుని ఫాతెహాలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

మద్దిలేటి స్వామి తిరుచ్చిన వేడుకలు

బేతంచెర్ల, సెప్టెంబరు 20 : మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం శివారులో వెలసిన మద్దిలేటి నరసింహ స్వామి క్షేత్రంలో స్వామి, అమ్మవార్ల తిరుచ్చిన వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలు ఉప కమిషనర్ ఆలయ ఈవో రామాంజనేయులు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎన్నికల డ్యూటీ సర్టిఫికెట్లు మంజూరు చేయాలి

బనగానపల్లె, సెప్టెంబరు 20: బనగానపల్లె అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహించిన ఎన్నికల ఉద్యోగ, ఉపాధ్యాయ సిబ్బదికి డ్యూటీ సర్టిఫికెట్లు అందించాలని యూటీఎఫ్ జిల్లా సహా ధ్యక్షుడు సత్యప్రకాశ్, మండల అధ్యక్షుడు ప్రతాప్‌లు శుక్రవారం ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దారు నారాయణరెడ్డికి వినతి పత్రం అందించారు. వేసవి సెలవుల్లో సాధారణ ఎన్నికల్లో 6,7 తేదీల్లో శిక్షణా కార్యక్రమాలు, 12,13 తేదీల్లో పోలింగ్ కేంద్రాల నిర్వహణ విధులు నిర్వహించారని, వారికి డ్యూటీ సర్టిఫికెట్ మంజూరు చేయాలని తహసీల్దారును కోరారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని శిక్షించాలి



సీఐకి వినతి పత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

డోన్(రూరల్), సెప్టెంబరు 20: కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ మిత్రపక్ష నాయకులపై కేసు నమోదు చేసి చట్టపరంగా శిక్షించాలని డోన్ నియోజకవర్గ సమన్వయ కర్త గార్లపాటి మద్దిలేటి డిమాండ్ చేశారు. ఈ మేరకు డోన్ పాతబస్టాండులోని గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా గార్లపాటి మద్దిలేటి మాట్లాడుతూ పార్లమెంటులో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని బీజేపీ అనుబంధ నాయకులు ఉగ్రవాదిగా పోల్చడం దుర్మార్గమైన చర్య అన్నారు. అనంతరం ర్యాలీగా వెళ్లి పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషాకు వినతి పత్రం అందజేశారు.